క్లుప్తంగా

ఘనంగా కుడారై మహోత్సవం



అమ్మవారికి పాయసం సమర్పణ

తుక్కుగూడ: జిన్నాయిగూడ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం కుడారై మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆచార్య మంగళాసనాలతో ధనుర్మాస ఉత్సవాలు చేశారు. అండాళ్ మాతకి 108 చిన్న గంగాళంలో పాయసం, తాంబూల మర్యాదను సమర్పించి, సాముహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోనమోని శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. అఖిల్

వెయిట్ లిఫ్టర్‌ను అభినందించిన మంత్రి



అఖిల్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి

కందుకూరు: ఇటీవల తమిళనాడులో నిర్వహించిన జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిన మండల పరిధిలోని నేదునూరుకు చెందిన సర్గారి అఖిల్‌రెడ్డిని బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తదితరులు అభినందించారు. ఇదే తరహాలో ప్రతిభ కనబరుస్తూ మరిన్ని పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టర్ తండ్రి బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాం భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నాయకులు సదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

మీర్‌పేట: ఈ నెల 13,14 తేదీల్లో తుర్కయంజాల్ మన్నెగూడలో జరగనున్న 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ బాలాపూర్ మండల అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి చెన్నప్పనాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, కేరళ మాజీ మంత్రి కే.కే.శైలజ, ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని, ఉపాధ్యాయులంతా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

మెరుగైన సేవలు అందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కంటి వెలుగు కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కంటి వెలుగు కార్యక్రమంపై మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమానికి వచ్చే అధికారులు, వైద్యులు, ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఠాక్రేకు ఘనస్వాగతం



మాణిక్‌రావుకు స్వాగతం పలుకుతున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువతో సన్మానించారు. గాంధీభవన్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



బడంగ్‌పేట్: క్రీడా మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

రంగవల్లులు

సంబురంగా ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నియోజకవర్గంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని సప్తవర్ణాలతో చూడచక్కని ముగ్గులు వేసి ఔరా అనిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అందమైన, ఆకర్షణీయమైన రంగవల్లులను ఎంపిక చేసి.. బహుమతులు ప్రదానం చేశారు.



కందుకూరు: విజేతలకు బహుమతులు అందజేసిన ప్రజాప్రతినిధులు

ప్రజలకు రుణపడి ఉంటా..

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: 'మీరు నన్ను గెలిపించడం వల్లే జెడ్పీటీసీ చైర్‌పర్సన్‌గా మీముందు ఉన్నానని, మీకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని' మహేశ్వరం ప్రజలను ఉద్దేశించి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. తన జన్మదినం సందర్భంగా బుధవారం గ్రామంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు సేవలు అందించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునిత, గ్రామాల సర్పంచ్‌లు ప్రియాంక, రాజేష్, రఘుపతి గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, పార్టీ నాయకులు రాఘవేందర్ గౌడ్, అంజనేయులు గౌడ్, శేఖర్, అజం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

పేదలకు అండగా సీఎం సహాయనిధి

హుడాకాంప్లెక్స్: పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఆపద సమయంలో అండగా ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అందించాలని స్థానిక ఎమ్మెల్యే మంత్రి సబితారెడ్డిని అభ్యర్థించారు. స్పందించిన మంత్రి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. దీంతో వెంకటేశ్వర కాలనీకి చెందిన లబ్ధిదారుడు నరసింహమూర్తికి రూ.60వేలు, లక్ష్మమ్మకు రూ.60వేలు, రూ.37,500ల చెక్కును నవీన్‌కుమార్‌లకు బుధవారం కొండల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలకిషన్, డివిజన్ అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, శ్రీనివాస్, ప్రత్యూష్, మధునాగుల, మహేందర్, రిషీ, కదారిరాజు యాదవ్, ఫయాజ్‌అలీ, మాణిక్‌సాయి, బోటు, మొగిళ్ల మల్లేష్, రాకేష్, వేణు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న కొండల్‌రెడ్డి, నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

ఏఈఈకి కాలనీ వాసుల వినతి



ఏఈఈకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీలో త్రీఫేస్ కరెంట్‌తో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ ఏఈ నాగిరెడ్డికి బుధవారం కాలనీవాసులు వినతిపత్రం అందచేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోనే అతి పెద్ద కాలనీగా పేరొందిన వినాయకహిల్స్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగదారులు పెరిగి.. విద్యుత్ వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. గతంలో వేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు ఉన్నప్పటికీ వాటిపై ఒత్తిడి పెరిగిందన్నారు. త్రీ ఫేస్‌తో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలనీలో ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఏఈ నేటి నుంచే పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లారెడ్డి కాలనీవాసులు ఉన్నారు.

నేడు 'చిర్‌పాల్' ప్రారంభం

హాజరుకానున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరులో ఉన్న ప్లాస్టిక్ పార్కులో చిర్‌పాల్ కంపెనీని గురువారం ఉదయం 11 గంటలకు మంత్రి సబితారెడ్డి ప్రారంభించనున్నారు. టీఎస్ఐఐసీ ప్లాస్టిక్ పార్కులో సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో 'చిర్‌పాల్'ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థలో పాలిఫిల్మ్, ఫుడ్ ప్యాకింగ్ మెటీరియల్స్ ఉత్పత్తి అవుతాయి. ఈ పాలిఫిల్మ్ కంపెనీ దక్షిణ భారతదేశంలో తొలిసారిగా తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నారు. సంస్థ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7వందల మందికిపైగా ఉపాధి లభించనుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.



ప్రారంభోత్సవానికి ముస్తాబైన కంపెనీ

ప్రజా సమస్యలు పట్టని మంత్రి సబిత



జల్‌పల్లి కమాన్ రోడ్డులో కల్వర్టును పరిశీలిస్తున్న అందెల

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. పార్టీ కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, ఎనగండ్ల ప్రశాంతి శ్రీధర్ గౌడ్‌లతో కలిసి జల్‌పల్లి కమాన్ రోడ్డులో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. జల్‌పల్లి కమాన్ రోడ్డులో చెరువు వద్ద కల్వర్టు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారిందన్నారు. వెంటనే నూతనంగా బ్రిడ్జి నిర్మించాలని కోరారు. మంత్రి సబితారెడ్డి ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ.. మున్సిపాలిటీని ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. అన్ని వార్డుల్లో రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

మహాసభలను విజయవంతం చేయండి

హుడాకాంప్లెక్స్: టీఎస్‌యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని సరూర్‌నగర్ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రమావత్ తావురియా నాయక్ అన్నారు. సరూర్‌నగర్‌లో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 5వ మహాసభలకు ఆహ్వానిస్తూ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, అధికారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్, జిల్లా కార్యదర్శులు గణేశ్‌కుమార్, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ శ్రీపురం కాలనీలోని శ్రీ కృష్ణవేణి జూనియర్ కళాశాల నిర్వాహకులు రూపొందించిన కేలండర్‌ను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.



ఊరెళ్తున్నారా.. జరభద్రం

పోలీసులకు సమాచారం ఇవ్వండి: ఇన్‌స్పెక్టర్ భాస్కర్



పహాడీషరీఫ్: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇంట్లోని విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను బ్యానర్‌లో పొందుపరిచామని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచడం.. బయట గేట్‌కు లోపల నుంచి తాళం వేయడం.. ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచడం.. పేపర్ బాయ్, పాలు వేసే వాళ్లకు రావొద్దని చెప్పాలని సూచించారు. ఊరికి వెళ్లేటప్పుడు నమ్మకమైన వారికి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు..వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ వేసి వెళ్లాలని సూచించారు. ఎవరిపైనా అనుమానం వస్తే డయల్-100 లేదా 94906 17172 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

కళాశాలకు మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్, అంప్లిఫైర్ అందజేసిన ప్రిన్సిపాల్

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి తన సొంత డబ్బును వెచ్చించి మైక్‌సెట్, అంప్లిఫైర్‌ను బుధవారం కళాశాలకు అందజేసి మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావాలన్నారు.

దాసర్లపల్లిలో ముగ్గుల పోటీలు

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సర్పంచ్ బాలమణి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు అండగా ఉంటా..

బీఆర్ఎస్ రాష్ట్ర యువనాయకుడు కార్తీక్‌రెడ్డి

తుక్కుగూడ: రావిర్యాల కొంగరఖుర్దు రెవిన్యూ పరిధిలోని భూ బాధిత రైతు కుటుంబాలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివాదంలో ఉన్న భూమి విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, నియోజకవర్గానికి చెందిన ఓ బీజేపీ నాయకుడు తమ ప్రతిష్టతను దెబ్బతీయడానికే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్‌లో ఎంతో మందిని మోసం చేసిన చరిత్ర ఆయనదని, తన కుటుంబం నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఉందని తెలిపారు. రాజకీయాల్లోకి రాకముందే మాకు ఉన్న ఆస్తుల వివరాలు తెలుసుకొని మాట్లాడాని హితవుపలికారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా నమ్మేస్థితిలో ప్రజలు లేరని చెప్పారు. ఇప్పటికే ఈ భూముల విషయంపై మంత్రి సబితారెడ్డి.. కలెక్టర్, రాచకొండ సీపీ విచారణ చేయమని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. త్వరలో పూర్తి వివరాలు బయటికి వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భవాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్య, కౌన్సిలర్లు రవి నాయక్, సుమన్, నాయకులు రాజు, శ్రీకాంత్, రాజు, బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, సురేష్, పద్మ, శ్రీలత, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, నరేష్, ప్రభాకర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం కబడ్డీ టోర్నీ

మీర్‌పేట: తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేట గాయత్రినగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌కార్తిక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. టోర్నీలో నగరంలోని కృష్ణవేణి స్కూళ్లకు చెందిన జట్లు తలపడ్డాయి. మొదటి స్థానంలో గ్రీన్‌పార్క్ స్కూల్, ద్వితీయ స్థానంలో గాయత్రినగర్, తృతీయ స్థానంలో నాగోలు శాఖ స్కూల్ జట్లు నిలిచాయి. అనంతరం గెలుపొందిన జట్లకు పాఠశాల డైరెక్టర్ సురేష్‌రెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జార్జ్‌పాల్, రామారావు పాల్గొన్నారు.



బహుమతులు, సర్టిఫికెట్లతో క్రీడాకారులు

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: పేదరికంలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా ఉంటుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన ఆయేషాబేగంకు రూ.32,500, సయ్యద్ అమీర్ అలీకి రూ.47,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ అబ్దుల్ రవూఫ్, హమీద్, అంజద్ ఖాన్, షౌకీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడికి చెందిన యాదమ్మకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.15 వేల చెక్కును బుధవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అందజేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనేగౌని పాండుగౌడ్, గౌరిగె రాజు, మాదాపూర్ సర్పంచ్ మంద సాయిలు పాల్గొన్నారు.

చెరువు పనులు పునఃరుద్ధరించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంత్రికి విన్నవించిన బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు తిరిగి చేపట్టాలని విద్యాశాఖమంత్రి సబితారెడ్డిని బుధవారం బాలాపూర్ బీఆర్ఎస్ నాయకులు విన్నవించారు. రూ.3 కోట్లతో పెద్ద చెరువు సుందరీకరణ పనులు మొదలు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పనులు కొనసాగుతుండగానే ఉన్నట్టుండి ఆగిపోయాయని మంత్రికి వివరించారు. పనులు పునరుద్ధరించాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో కో-ఆప్షన్ సభ్యుడు రఘునందన్‌చారి, పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు తిమ్మని గిరీశ్, అరవింద్‌గౌడ్, హరిగౌడ్, యువ నాయకులు అశ్విన్‌రెడ్డి, రితిన్‌రెడ్డి, కుసుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'సంక్షేమ' ఫలాలు

- పథకాలను పటిష్టంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఆసరా పింఛన్ కార్డుల పంపిణీ

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలు, నిరుపేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పటిష్టంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని అర్హులైన 302 మందికి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆసరా పింఛన్ గుర్తింపు కార్డులను స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి ఎమ్మెల్యే తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులకు రూ. 200, దివ్యాంగులకు రూ. 500 ప్రకారం పింఛన్ ఇచ్చేవారని... తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్‌లను రూ. 2016కు, దివ్యాంగులకు రూ. 3016 ప్రకారం పెంచారని గుర్తుచేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

- పింఛన్‌దారులకు 65 ఏళ్ల వయసు పరిమితిని 57 ఏళ్లకు కుదించడమే కాకుండా గత ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 10 లక్షల మంది అర్హులకు ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసిందన్నారు.
- గతంలో పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు అక్కడా ఇక్కడా తిరిగేవారని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నట్లు సుధీర్‌రెడ్డి వెల్లడించారు.
- పేదింటి ఆడపడుచుల పెళ్లికి రూ. 1,00,116ల ఆర్థిక సాయం అందిస్తూ వారి కుటుంబాలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారన్నారు.
- పేదలు సంతోషంగా ఉండాలని, వారు గొప్పగా బతకాలనేది ప్రభుత్వ ఉద్దేశమని సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు.
- కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, ఆదిలక్ష్మి, చీర శ్రీనివాస్, తిలక్, రాకేశ్ పాల్గొన్నారు.